ఏరియా ఆస్పత్రిలో రోగుల వెతలు!


మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రి


ఓపీ విభాగం వద్ద రోగులు

- మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిలో అందుబాటులో ఉండని వైద్యులు
- 37మంది వైద్యులకు హాజరయ్యేది కొందరే..

మిర్యాలగూడ అర్బన్: రాష్ట్ర ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తూ ఏరియా ఆస్పత్రుల్లో అన్ని రకాల వసతులు కల్పిస్తోంది. కానీ క్షేత్ర స్థాయిలో అందుకు భిన్నంగా ఉంది. మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రిని వంద పడకల ఆస్పత్రి మార్చి పూర్తి స్థాయిలో వైద్యులను నియమించిన ప్రభుత్వం 24గంటలు అందుబాటులో ఉండే విధంగా ఏర్పాటు చేసింది. అందుకు అనుగుణంగా ఆస్పత్రిలో అన్ని సౌకర్యాలు సమకూర్చి రోగులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చర్యలు తీసుకున్నారు. అయితే వైద్యులు సకాలంలో ఆస్పత్రికి రాకపోవడంతో రోగులకు ఇబ్బందులు తప్పడం లేదు. వైద్యులపై పర్యవేక్షణ లేకపోవడంతో ఏదో మొక్కుబడిగా ఆస్పత్రికి వచ్చి వెళ్తున్నారని విమర్శలు వినిపిస్తున్నాయి.

మధ్యాహ్నం 12గంటల లోపు వెళ్లిపోతుండటంతో రోగులకు ఇబ్బందులు..

ఏరియా ఆస్పత్రిలో సివిల్ సర్జన్స్ 9మంది, డిప్యూటీ సివిల్ సర్జన్లు ముగ్గురు, సివిల్ అసిస్టెంట్ సర్జన్‌లు 11 మంది ఉండగా, వీరికి తోడు మరో 14 మంది కాంట్రాక్ట్ వైద్యులు ఉన్నారు. రోజువారీ విధుల్లో భాగంగా ఆస్పత్రి రోస్టర్ ప్రకారం రాత్రి, పగలు డ్యూటీలు ఉంటాయి. కానీ ఎలాంటి రోస్టర్ పద్ధతి పాటించకుండా కొందరు మాత్రమే డ్యూటీలకు హాజరవుతున్నారనే విమర్శలు ఉన్నాయి. వివిధ విభాగాలకు చెందిన వైద్యులు రాకపోవడంతో హాజరైన వైద్యులే అన్ని రకాల వ్యాధులకు మందులు రాసిస్తున్నారు. వారు కూడా మధ్యాహ్నం 12గంటల లోపు వెళ్లి పోతుండటంతో రోగులు ఇబ్బందులకు గురవుతున్నారు. వైద్యుల హాజరు కోసం బయోమెట్రిక్ లేకపోవడంతోనే వారు హాజరు కాకుండా సొంతంగా ఏర్పాటు చేసుకున్న ఆస్పత్రుల్లో ఉంటున్నారని పలువురు పేర్కొంటున్నారు.

వైద్య పరీక్షల కోసం వస్తే డాక్టర్ లేడు



నాకు చర్మంపై దద్దుర్లు వచ్చాయి. చర్మ వ్యాధుల డాక్టర్ వద్ద చూపించుకోవడానికి ఉదయం 9గంటలకే వచ్చి ఓపీ రాయించుకున్నా. 10గంటలు దాటినా డాక్టర్ రాలేదు. ప్రైవేట్‌లో చూపించుకోవాలంటే ఓపీ ఫీజే రూ.400 తీసుకుంటారు. పరీక్షలకు మరో రూ.500, మందులకు రూ.2వేల దాక తీసుకుంటారు. అంత డబ్బు లేక ప్రభుత్వ ఆస్పత్రికి వచ్చా. కానీ ఇక్కడ డాక్టర్ అందుబాటులో లేడు.

– రాకేష్, అడవిదేవులపల్లి

అన్ని రకాల సేవలు అందే విధంగా చూస్తాం



ఆస్పత్రిలో వైద్యులందరూ సకాలంలో డ్యూటీకి హాజరయ్యే విధంగా చర్యలు తీసుకుంటాం. వైద్యుల హాజరు కోసం బయోమెట్రిక్ విధానం ఏర్పాటు చేసే విషయం జిల్లా అధికారుల దృష్టిలో ఉంది. ఏరియా ఆస్పత్రికి వచ్చే రోగులకు అన్ని రకాల వైద్య సేవలు అందించే విధంగా కృషి చేస్తున్నాం.

– శ్రీనివాస సమరథ్, మిర్యాలగూడ ఏరియా ఆస్పత్రి సూపరింటెండెంట్

విద్యార్థులు క్రీడలపై ఆసక్తి పెంచుకోవాలి

- ఎమ్మెల్సీ శంకర్‌నాయక్


విద్యార్థులను అభినందిస్తున్న ఎమ్మెల్సీ

మిర్యాలగూడ అర్బన్: విద్యార్థులు చదువుల్లోనే కాకుండా క్రీడల్లోనూ రాణించాలని, కరాటే పోటీల్లో మిర్యాలగూడ విద్యార్థులు ప్రతిభ కనబర్చడం ఆనందంగా ఉందని ఎమ్మెల్సీ కేతావత్ శంకర్ నాయక్ అన్నారు. హా రేంజ్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ కరాటే పోటీలు గత నెల 27వ తేదీన హైదరాబాద్‌లోని సరూర్‌నగర్ ఇండస్ట్రీలో జరిగాయి. ఈ పోటీల్లో పట్టణంలోని సుమన్ చోటోఖాన్ కరాటే అకాడమీకి చెందిన అపర్ణ, సాయి సాత్విక్, కష్షం ఆరెంజ్ బెల్ట్ సాధించగా, డెవిడ్ రామ్, సాయి సమిత్రాన్‌లు వైట్ బెల్ట్, ప్రద్యుత్ బ్రౌన్ బెల్ట్ సాధించారు. ఈమేరకు బుధవారం మిర్యాలగూడ పట్టణంలో ఏర్పాటు చేసిన థ కార్యక్రమంలో ఎమ్మెల్సీ శంకర్ నాయర్ విద్యార్థులను అభినందించారు. కరాటే అకాడమీ చీఫ్ మాస్టర్ సైదులు తదితరులున్నారు.

బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన


అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న సభ్యులు

మిర్యాలగూడ అర్బన్: బాల్య వివాహాలతో బాలికలు అనేక సమస్యలు ఎదుర్కొంటారని, బాల్య వివాహాలను అరికట్టాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని అశ్వితి స్వచ్ఛంద సంస్థ సోషల్ వర్కర్ కవిత తెలిపారు. బుధవారం ఆలగడప ఐసీడీఎస్ మిర్యాలగూడ ప్రాజెక్టు, అశ్వితి స్వచ్ఛంద సంస్థ ఆధ్వర్యంలో బాల్య వివాహాల నిర్మూలనపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. బాల్య వివాహాల విముక్తి భారత్ కోసం ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కోరారు. కార్యక్రమంలో ఐసీడీఎస్ డీపీఓ మమత, సెక్టర్ సూపర్‌వైజర్ రాధిక, సీఆర్పీ జిల్లా అధ్యక్షులు శ్రీను, వెంకన్న, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

ప్రధానోపాధ్యాయుడికి వీడ్కోలు సమావేశం

గుర్రంపోడు : ఉద్యోగ విరమణ పొందిన నడికూడ జెడ్పీ ఉన్నత పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గుమ్మడవల్లి శత్రయ్యను బుధవారం ఘనంగా సన్మానించారు. పాఠశాల నూతన ఇన్‌చార్జి హెచ్ఎం శోభారాణిని పలువురు అభినందించారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు జయరాజు, శంకరయ్య, రమాదేవి, మారెడ్డి వెంకట్‌రెడ్డి, శ్రీరంజన్, మారెడ్డి, పీఆర్‌టీయూ రాష్ట్ర నాయకుడు కాలం నారాయణరెడ్డి పాల్గొన్నారు.

4న నీట్ ప్రవేశ పరీక్ష

- ఏర్పాట్లు పకడ్బందీగా ఉండాలి
- కలెక్టర్ ఇలా త్రిపాఠి


జిల్లా స్థాయి సమన్వయ సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

నల్లగొండ: ఈనెల 4వ తేదీన నీట్ (నేషనల్ ఎలిజిబిలిటీ కం ఎంట్రెన్స్ టెస్టు) అండర్ గ్రాడ్యుయేషన్ –2025 ప్రవేశ పరీక్ష జరగనున్నందున ఏర్పాట్లు పకడ్బందీగా చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి ఆదేశించారు. బుధవారం నల్లగొండ కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో నిర్వహించిన జిల్లా స్థాయి సమన్వయ సమావేశంలో ఆమె మాట్లాడారు. పొరపాట్లకు అవకాశం లేకుండా పరీక్ష పక్కాగా నిర్వహించాలన్నారు. ఆదివారం మధ్యాహ్నం 2 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు పరీక్ష జరుగుతుందన్నారు. జిల్లా కేంద్రంలో 7 పరీక్ష కేంద్రాలు ఏర్పాటు చేశామన్నారు. 4 పరీక్ష కేంద్రాలు ఎంజీ యూనివర్సిటీలో, మిగతా మూడు కేంద్రాలను నల్లగొండలోని ఎన్జీ, ఉమెన్స్ కళాశాలలు, కేంద్రీయ విద్యాలయంలో ఏర్పాటు చేశామన్నారు. జిల్లాలో 2,048 మంది విద్యార్థులు పరీక్ష రాయనున్నారని తెలిపారు. ఉదయం 10 గంటల నుంచి మధ్యాహ్నం 1:30 వరకే కేంద్రాల్లోకి అనుమతిస్తారన్నారు. అభ్యర్థులు అడ్మిట్ కార్డులో ఉన్న సూచనలు పాటించాలన్నారు. ఎలక్ట్రానిక్ పరికరాలకు అనుమతి లేదని, పెన్ను కూడా పరీక్ష కేంద్రంలోనే ఇస్తారన్నారు.

స్ట్రాంగ్‌రూమ్ వద్ద గట్టి పోలీస్ భద్రత

నీట్ పరీక్ష పత్రాలు భద్రపరిచే స్ట్రాంగ్ రూమ్‌ల వద్ద పోలీస్ భద్రతతోపాటు పరీక్ష నిర్వహించే రోజు కేంద్రాల పరిధిలో పూర్తి బందోబస్తు ఏర్పాటు చేయాలని అధికారులను ఆదేశించారు. పరీక్ష కేంద్రాల్లో అన్ని సదుపాయాలు కల్పించాలన్నారు. పరీక్షపై ఎలాంటి సందేహాలున్నా నివృత్తి చేసేందుకు టోల్‌ఫ్రీ నంబర్ 18004251442ను సంప్రదించాలని సూచించారు. సమావేశంలో ఇన్‌చార్జి అదనపు కలెక్టర్లు నారాయణ్ అమిత్, రాజ్‌కుమార్, అదనపు ఎస్పీ రమేష్, డీఎస్పీ శివరాంరెడ్డి, నీట్ నోడల్ అధికారి, కేంద్రీయ విద్యాలయ ప్రిన్సిపల్ శ్రీనివాసులు, అధికారులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోలులో ఇబ్బందుల్లేవు

నల్లగొండ: యాసంగి సీజన్ ధాన్యం కొనుగోలులో ఎలాంటి ఇబ్బందులు లేవని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. బుధవారం హైదరాబాద్ నుంచి రాష్ట్ర పౌర సరఫరాల, నీటిపారుదల శాఖ మంత్రి ఎన్.ఉత్తమ్‌కుమార్‌రెడ్డి నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న అనంతరం ఏర్పాటు చేసిన సమావేశంలో కలెక్టర్ మాట్లాడారు. ప్రతి రైతుకూ ప్రభుత్వ మద్దతు ధర అందేలా చూడాలన్నారు. అకాల వర్షాలను దృష్టిలో ఉంచుకుని ధాన్యం తడవకుండా గోదాముల్లో నిల్వ చేసేందుకు చర్యలు చేపట్టాలన్నారు. కొనుగోలు కేంద్రాల నుంచి ధాన్యాన్ని మిల్లులకు తరలించడాన్ని వేగవంతం చేయాలన్నారు. సమావేశంలో ఇన్‌చార్జ్ అదనపు కలెక్టర్ నారాయణ అమిత్, పౌరసరఫరాల జిల్లా మేనేజర్ హరీష్, డీఎస్‌ఓ వెంకటేశ్వర్లు, డీసీఓ పత్యానాయక్, మార్కెటింగ్ శాఖ ఏడీ ఛాయాదేవి తదితరులు పాల్గొన్నారు.

ధాన్యం కొనుగోళ్లు వేగంగా చేపట్టాలి


చింతపల్లిలోని ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ ఇలా త్రిపాఠి

- కలెక్టర్ ఇలా త్రిపాఠి

చింతపల్లి: కేంద్రాలకు వచ్చే ధాన్యాన్ని వేగంగా కొనుగోలు చేయాలని కలెక్టర్ ఇలా త్రిపాఠి అన్నారు. చింతపల్లి మండల కేంద్రంలోని ధాన్యం కొనుగోలు కేంద్రంతో పాటు, వెంకటంపేట ఎక్స్ రోడ్డు వద్ద ఏర్పాటు చేసిన ధాన్యం కొనుగోలు కేంద్రాన్ని బుధవారం ఆమె పరిశీలించారు. అనంతరం మండల కేంద్రంలోని ధాన్యం నిలువ చేసే గోదాములను తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాంటా వేసిన ధాన్యాన్ని ఎప్పటికప్పుడు నిర్దేశించిన రైస్ మిల్లులకు తరలించాలన్నారు. ఎండ లేని సమయంలోనే కాంటా వేయాలని, రైతులకు ఓఆర్ఎస్ ప్యాకెట్లు, మంచి నీటిని అందుబాటులో ఉంచాలని సూచించారు. రైస్ మిల్లుల వద్ద కొనుగోలు కేంద్రాల నుంచి వచ్చే ధాన్యాన్ని వెంటనే అన్‌లోడ్ చేసి ఓపీఎంఎస్‌లో అప్‌డేట్ చేయాలన్నారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన బియ్యం మిల్లర్లు మే నెల వరకు చెల్లించాలని ఆదేశించారు. ధాన్యం కొనుగోలు ప్రక్రియ సజావుగా సాగుతుందని తెలిపారు. లారీల కొరత ఉండడంతో ధాన్యం కొనుగోలు సక్రమంగా సాగడం లేదని కలెక్టర్ దృష్టికి తీసుకు వెళ్లగా సంబంధిత అధికారులకు లారీల కొరత ఉండకుండా చూడాలని సూచించారు. ఆమె వెంట ఏఎస్పీ మౌనిక, ఆర్డీఓ రమణారెడ్డి, సీఈఓ రాజశేఖర్ రెడ్డి, సివిల్ సప్లయ్ జిల్లా మేనేజర్ హరీష్, తహసీల్దార్ రమాకాంత్ శర్మ, ఎంపీడీఓ సుజాత, ఏఓ శ్రావణ కుమారి, ఏడీఏ శ్రీలక్ష్మి, ఏఈఓ మౌనిక ఉన్నారు.

అనుమతి లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి

హాలియా : మండలంలో అనుమతులు లేని పాఠశాలలపై చర్యలు తీసుకోవాలి అనుముల మండల ట్రెస్మా అధ్యక్షుడు తడకమళ్ల శ్రీనివాస్ అన్నారు. ప్రభుత్వ అనుమతులు లేకుండా విద్యార్థుల నుంచి అడ్మిషన్లు చేపడుతున్న శ్రీ చైతన్య పాఠశాలపై చర్యలు తీసుకోవాలని బుధవారం డీఈఓ బొల్లారం భిక్షపతికి వినతి పత్రం అందజేశారు. వారిలో ట్రెస్మా జిల్లా సెక్రటరీ జీవీ రావు, మంద నరేందర్ రెడ్డి, సతీష్, విజయ భాస్కర్ రెడ్డి పాల్గొన్నారు.

కళ తప్పిన పల్లెప్రకృతి వనం



చందంపేట : మండలంలోని పోల్యానాయక్‌తండా గ్రామపంచాయతీలోని పల్లె ప్రకృతి వనం కళ తప్పింది. సరైన నిర్వహణ లేకపోవడం, చెట్లకు నీళ్లు అందించకపోవడంతో చాలా వరకు మొక్కలు ఎండిపోయాయి. చెత్తా చెదారం, పిచ్చి మొక్కలు పెరగడంతో పల్లె ప్రకృతి వనం అధ్వానంగా మారింది. గ్రామపంచాయతీ కార్యదర్శి దృష్టికి తీసుకెళ్లినప్పటికీ స్పందించడం లేదని గ్రామస్తులు పేర్కొంటున్నారు.

టెన్త్‌లో సత్తాచాటిన ప్రభుత్వ పాఠశాలలు


సహస్ర, 574 మార్కులు, ఎస్సీ గురుకుల పాఠశాల, కొండమల్లేపల్లి


అనూష, 570 మార్కులు, ఎస్టీ గురుకుల పాఠశాల, కొండమల్లేపల్లి


స్పందన, 561 మార్కులు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, కొండమల్లేపల్లి

పెద్దఅడిశర్లపల్లి : పదో తరగతి ఫలితాల్లో ఉమ్మడి పీఏపల్లి మండలంలో విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. పెద్దఅడిశర్లపల్లి మండలంలో మొత్తం 315 మందికి 315 మంది విద్యార్థులు పాసై 100 శాతం ఉత్తీర్ణత సాధించారు. విద్యార్థులను ఆయా పాఠశాలల యాజమాన్యాలు అభినందించాయి.

కేజీబీవీలో వందశాతం ఉత్తీర్ణత

మాడ్గులపల్లి: టెన్త్ ఫలితాల్లో మాడ్గులపల్లి మండలంలోని కుక్కడం గ్రామంలో గల కేజీబీవీ విద్యార్థులు వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఎస్‌ఓ వసంతకుమారి తెలిపారు. డి.రేణుక 538, ఈ.వసంత 535, శిరీష 516, జి.కార్తీక 506, జె.వర్షిత 508, వి.పావని 506, పి.అక్షయ 503 మార్కులు సాధించినట్లు చెప్పారు. ఉత్తమ ప్రతిభ చాటిన విద్యార్థులను ఆమె అభినందించారు.

అడవిదేవులపల్లి: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పదో తరగతి విద్యార్థులు ప్రతిభ చాటినట్లు ఎంఈఓ, హెచ్ఎం వరలక్ష్మీ తెలిపారు. మొత్తం 59మందికి 59మంది పాసై వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు పేర్కొన్నారు. జల్లెడ శ్రీ ఈశ్వరి 553 మార్కులు, ఇరపూరి సిద్దార్థ 539మార్కులు, కట్ల చరణ్య 513 మార్కులు సాధించారు. అదేవిధంగా మండల కేంద్రంలోని కేజీబీవీలో 26 మందికి 26 మంది పాసైనట్లు ఎస్‌ఓ నాగలక్ష్మి తెలిపారు.

ప్రతిభ చూపిన జెడ్పీఉన్నత పాఠశాలలు

నిడమనూరు : టెన్త్ ఫలితాల్లో నిడమనూరు మండలంలోని జెడ్పీ ఉన్నత పాఠశాలల విద్యార్థులు మెరుగైన ఫలితాలు సాధించారు. అత్యధికంగా తమ్మడం జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థి సాయిరాం 547 మార్కులు సాధించాడు. బీసీ గురుకుల విద్యార్థి గగులోతు గణేష్ 560, బాలికల గిరిజన పాఠశాల విద్యార్థిని ఏ. వర్షిత 554 మార్కులు సాధించారు. జెడ్పీ ఉన్నత పాఠశాలలో 243 మంది విద్యార్థులకు 236 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. నిడమనూరు ఆదర్శ పాఠశాలలో 81 మంది విద్యార్థులకు 80 మంది ఉత్తీర్ణత సాధించారు. ఆదర్శ పాఠశాల విద్యార్థిని బండారు పూజిత 526. ఆర్ సాత్విక, ఎం రఘువీర్ 501(ముకుందాపురం), నిడమనూరు జెడ్పీ ఉన్నత పాఠశాల విద్యార్థిని 500 మార్కులు సాధించారు. ఉత్తీర్ణత సాంధించిన విద్యార్థులకు ఎంఈఓ లావురి వెంకన్న అభినందనలు తెలిపారు.

గురుకుల విద్యార్థినుల ప్రతిభ

కొండమల్లేపల్లి: టెన్త్ ఫలితాల్లో కొండమల్లేపల్లి పట్టణ కేంద్రంలోని ఎస్సీ గురుకుల బాలికల పాఠశాలకు చెందిన జె.సహస్ర 574 మార్కులతో డివిజన్ టాపర్‌గా నిలిచింది. అదేవిధంగా ఎస్టీ గురుకుల బాలికల పాఠశాలకు చెందిన ఆర్.అనూష 570 మార్కులు సాధించింది.

తిరుమలగిరి(నాగార్జునసాగర్): మండలంలోని ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు ప్రతిభ కనపర్చారు. మండల కేంద్రంలోని కేజీబీవీలో 32 మందికి గాను 32 మంది విద్యార్థినులు ఉత్తీర్ణత సాధించారు. బానాల స్పందన 524 మార్కులు సాధించి మండల టాపర్‌గా నిలిచింది. తలసాని శిరీష 519 మార్కులు సాధించారు. రాజవరం జెడ్పీహెచ్ఎస్‌లో ఏడుగురికి ఏడుగురు ఉత్తీర్ణత సాధించి నూరుశాతం ఫలితం పొందారు. ఈ సందర్భంగా విద్యార్థులను ఎంఈఓ శ్రీనివాస్ అభినందించారు.

పెద్దవూర మండలంలో నూరుశాతం ఉత్తీర్ణత

పెద్దవూర: పదో తరగతి ఫలితాల్లో పెద్దవూర మండలం నూరుశాతం ఉత్తీర్ణత సాధించినట్లు మండల విద్యాధికారి తరి రాములు తెలిపారు. మండలంలో ఐదు జెడ్పీహెచ్ఎస్, ఎస్టీ గురుకుల విద్యాలయం, కేజీబీవీ, ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాల, రెండు ప్రైవేటు పాఠశాలలు ఉన్నాయి. వీనిలో మండలంలో మొత్తం 696 మంది విద్యార్థులు పదవ తరగతి వార్షిక పరీక్షలకు హాజరు కాగా, అందరూ ఉత్తీర్ణత సాధించారు. మండల కేంద్రంలోని జెడ్పీహెచ్ఎస్‌లో మొత్తం 114 మంది విద్యార్థులకు గాను 114 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు.

తహసీల్దార్ ప్రత్యేక చొరవ


విద్యార్థులకు పాఠాలు బోధిస్తున్న తహసీల్దార్ శ్రీనివాసులు (ఫైల్)

చందంపేట: చందంపేట కస్తూర్బా బాలికల పాఠశాలలో ఇంగ్లిష్ బోధించే ఉపాధ్యాయుడు లేకపోవడంతో తహసీల్దార్ శ్రీనివాసులు ప్రత్యేక చొరవ తీసుకొని విద్యార్థులకు పాఠాలు బోధించారు. తాజాగా విడుదలైన పదో తరగతి ఫలితాలలో విద్యార్థినులు మెరుగైన మార్కులు సాధించారు. పాఠశాలకు చెందిన ఎస్.శ్రీవాణి 524 మార్కులు సాధించి ఉత్తమ ప్రతిభ కనబర్చింది.

దగ్ధమైన ఆయిల్‌పామ్ మొక్కల పరిశీలన


మొక్కలను పరిశీలిస్తున్న ఉద్యానవన మిర్యాలగూడ డివిజన్ అధికారి నసీమా

అడవిదేవులపల్లి: మండలంలోని ముదిమాణిక్యం గ్రామంలో ఓ రైతు తన పొలంలో ఎండిన పత్తికట్టెను తగులబెట్టడంతో మంటలు వ్యాపించి పక్కనే ఉన్న మంచికలపూడి శంకర్‌రావుకు చెందిన 20 ఎకరాల ఆయిల్ పామ్ తోటలోని 40 మొక్కలతోపాటు డ్రిప్ పైప్‌లైన్ దగ్ధమైంది. విషయం తెలుసుకున్న ఉద్యానవన మిర్యాలగూడ డివిజన్ అధికారి నసీమా బుధవారం బాధిత రైతు ఆయిల్ పామ్ తోటను పరిశీలించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. కాలిపోయిన మొక్కల చుట్టూ పాదులు చేసుకుని కలుపును, కాలిన ఎండుగడ్డిని తొలగించి 2కేజీల బియ్యం, 2కేజీల యూరియాను 20లీటర్ల డ్రమ్‌లో కలిపి కాలిన మొక్కలపై పిచికారీ చేయాలన్నారు. ఆమెవెంట పతంజలి డివిజన్ ఫీల్డ్ ఆఫీసర్ సుధాకర్, రాజా తదితరులున్నారు.

అభ్యాస్ టెక్నో స్కూల్ విద్యార్థుల విజయభేరి


576 మార్కులు సాధించిన అభ్యాస్ పాఠశాల విద్యార్థిని అక్షిత

మిర్యాలగూడ: పట్టణంలోని సంతోష్‌నగర్‌లోని అభ్యాస్ టెక్నో హైస్కూల్ విద్యార్థులు పదో తరగతి ఫలితాల్లో సత్తా చాటారు. పాఠశాలలో 102 మంది విద్యార్థులు 500 మార్కులకు పైగా సాధించారు. ఎల్.అక్షిత 576, దుర్గాబింధు 570, సర్దాల లోకేష్ 570, చిలువేరు దీపిక 568 మార్కులు సాధించారు. ప్రతిభ చాటిన విద్యార్థులను పాఠశాల చైర్మన్ నిరంజన్‌రెడ్డి అభినందించారు.

లోటస్ విజయ దుందుభి


ప్రతిభ కనబరిచిన విద్యార్థులను అభినందిస్తున్న లోటస్ పాఠశాల యాజమాన్యం

మిర్యాలగూడ: పదో తరగతి ఫలితాల్లో మిర్యాలగూడ పట్టణంలోని లోటస్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ చాటినట్లు పాఠశాల చైర్మన్ బొడ్డుపల్లి వరప్రసాద్ తెలిపారు. టి.దేవిశ్రీ 576 మార్కులతో పట్టణ ప్రథమ స్థానం సాధించగా ఎ.గాయత్రి 561 మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. విద్యార్థులందరూ పాసై వందశాతం ఉత్తీర్ణత సాధించినట్లు తెలిపారు.

ఎస్‌పీఆర్ విద్యార్థుల ప్రతిభ


విద్యార్థులను అభినందిస్తున్న ఎస్‌పీఆర్ యాజమాన్యం

మిర్యాలగూడ: పదో తరగతి పరీక్షా ఫలితాల్లో మిర్యాలగూడ పట్టణంలోని ఎస్‌పీఆర్ పాఠశాల విద్యార్థులు ప్రతిభ కనబరిచినట్లు పాఠశాల యాజమాన్యం, ప్రిన్సిపాల్ యామిని వెంకటేశ్వర్లు తెలిపారు. జె.కృతికరెడ్డి 580, అమ్మర నస్రీన్ 577, వి.రెడ్డి ప్రణవి 576, సీహెచ్.ప్రియదర్శిని 575, జె.గురుపద్మశ్రీ 575, ఎస్‌కె.నదీన్ 573, బి.శరణ్య 571, సీహెచ్.కరుణ 570 మార్కులు సాధించినట్లు పేర్కొన్నారు. 20 మంది విద్యార్థులు 550 మార్కులకు పైగా సాధించగా 66 మంది విద్యార్థులు 500 మార్కులకు పైగా సాధించారని తెలిపారు. పరీక్షకు హాజరైన విద్యార్థులందరూ పాసై వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు చెప్పారు. పాఠశాల డైరెక్టర్లు గార్లపాటి ఉమాకర్ రెడ్డి, జొన్నలగడ్డ శ్రీనివాస్‌రెడ్డ, నాదెండ్ల అయ్యన్న, నీలిమారెడ్డి, కొనుగంటి శ్రీనివాస్‌రెడ్డి, రోహిత్‌కుమార్ విద్యార్థులను అభినందించారు.

పశువులకు మెరుగైన వైద్యం అందించాలి


వాహనంలో రిజిస్టర్‌ను పరిశీలిస్తున్న బగీశ్‌మిశ్రా

దేవరకొండ : గ్రామీణ ప్రాంతాల్లో పశు సంపదకు మెరుగైన వైద్యసేవలు అందించాలని తెలంగాణ సంచార పశు వైద్యశాల రాష్ట్ర కోఆర్డినేటర్ డాక్టర్ బగీష్‌మిశ్రా సిబ్బందికి సూచించారు. బుధవారం దేవరకొండలో 1962 సంచార పశు వైద్యశాల వాహనాలను ఆయన తనిఖీ చేశారు. వాహనంలో రిజిస్టర్, అందుబాటులో ఉన్న మందుల వివరాలు, వైద్య పరికరాలను పరిశీలించారు. ఆయన వెంట జిల్లా మేనేజర్ నసీరొద్దీన్, జిల్లా కోఆర్డినేటర్ మధు, వైద్య సిబ్బంది లచ్చిరాం, దేవిలాల్, కృష్ణ తదితరులు ఉన్నారు.

క్లుప్తంగా

ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత

కొండమల్లేపల్లి: ఆధ్యాత్మిక చింతనతో మానసిక ప్రశాంతత కలుగుతుందని దేవరకొండ ఎమ్మెల్యే నేనావత్ బాలునాయక్ అన్నారు. బుధవారం కొండమల్లేపల్లి మండలంలోని దంజిలాల్‌తండా, చెన్నారం గ్రామంలో నిర్వహించిన శ్రీ బర్మస్వామి, గణపతి, ఆంజనేయ స్వామి విగ్రహ ప్రతిష్ఠ మహోత్సవంలో పాల్గొన్ని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను సన్మానించారు. కార్యక్రమంలో పీఏసీఎస్ చైర్మన్ వేణుధర్‌రెడ్డి, నాయకులు జగన్, రమావత్ లలిత, భీమ్‌సింగ్, రామకృష్ణ, రాము భక్తులు తదితరులు పాల్గొన్నారు.

సీఎంఆర్‌ఎఫ్ చెక్కు పంపిణీ


లబ్ధిదారుడికి చెక్కు అందజేస్తున్న లక్ష్మారెడ్డి

మిర్యాలగూడ: సీఎం సహాయ నిధి పేదలకు వరం లాంటిదని ఎమ్మెల్యే బత్తుల లక్ష్మారెడ్డి అన్నారు. మిర్యాలగూడ పట్టణంలోని 27వ వార్డుకు చెందిన పగడాల ఇందిరమ్మకు మంజూరైన సీఎంఆర్‌ఎఫ్ చెక్కును బుధవారం ఆయన స్థానిక ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో అందజేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చిలుకూరు బాలు, మాజీ కౌన్సిలర్ దేశిడి శేఖర్‌రెడ్డి, గొట్టిముక్కల లక్ష్మణ్ తదితరులు పాల్గొన్నారు.

బాధ్యతల స్వీకరణ


న్యాయమూర్తికి పుష్పగుచ్ఛం అందజేస్తున్న బార్ అసోసియేషన్ సభ్యులు

మిర్యాలగూడ టౌన్ : మిర్యాలగూడ ప్రధాన జూనియర్ సివిల్ జడ్జిగా పవన్‌కుమార్ బుధవారం బాధ్యతలు స్వీకరించారు. సికింద్రాబాద్ జుడీషియల్ అకాడమిలో ఆయన పని చేసి మిర్యాలగూడకు బదిలీపై వచ్చారు. న్యాయమూర్తికి బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో పుష్పగుచ్ఛాలు అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో బార్ అసోసియేషన్ అధ్యక్ష, కార్యదర్శులు నేతి సత్యనారాయణ, అలుగుబెల్లి భూపతిరెడ్డి, కోశాధికారి సాయికుమార్ యాదవ్, ఉపాధ్యక్షుడు సుండి శ్రీనివాస్, జాయింట్ సెక్రటరీ చెలిమల పద్మయ్య, బాణాల ఉమాశంకర్, కరుణం లింగయ్య తదితరులున్నారు.

అంకిత భావంతో పనిచేస్తే గుర్తింపు


మల్లేశం దంపతులను సన్మానిస్తున్న ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్ యాదన్ కుమార్

చింతపల్లి: ఉద్యోగ బాధ్యతల్లో అంకిత భావంతో పనిచేస్తేనే అసలైన గుర్తింపు ఉంటుందని నీటిపారుదల శాఖ ఈఈ యాదన్ కుమార్ అన్నారు. ఆఫీస్ సబార్డినేట్ కొలను మల్లేశం ఉద్యోగ విరమణ పొందడంతో బుధవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈసందర్భంగా కొలను మల్లేశం, కనకమ్మ దంపతులను సన్మానించారు. అదేవిధంగా పదోన్నతిపై బదిలీపై వెళ్తున్న రేహమతున్నిసాను సన్మానించారు. కార్యక్రమంలో డీఈలు సదానందం, కరునాసాగర్, జ్ఞానేశ్వర్, స్టాఫ్ వాజిద్దీన్, హనుమాన్, టీఎన్జీఓ ప్రెసిడెంట్ మనోజ్ ప్రదీప్ పాల్గొన్నారు.

ఆత్మరక్షణకు కరాటే దోహదం


కరాటే శిక్షణ శిబిరాన్ని ప్రారంభిస్తున్న ఎస్ఐ

నిడమనూరు : ఆత్మరక్షణకు కరాటే ఎంతగానో దోహదపడుతుందని నిడమనూరు ఎస్ఐ ఉప్పు సురేష్ అన్నారు. బుధవారం మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో కరాటే శిక్షణ శిబిరాన్ని ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ.. విద్యార్థి దశ నుంచి క్రీడలు, కరాటే వంటి వంటివి నేర్చుకోవడంతో ఆత్మ రక్షణ, శారీరక దారుఢ్యం, మెరుగైన వ్యక్తిగత నైపుణ్యాలు సాధించవచ్చని తెలిపారు. కార్యక్రమంలో జిల్లా అసోసియేషన్ అధ్యక్షుడు పొతుగంటి శ్రీనివాస్, కొట్ల సైదులు, జాషువా, విద్యార్థులు పాల్గొన్నారు.

పౌరహక్కుల సదస్సు

నిడమనూరు : మండలంలోని బొక్కమంతల పహాడ్‌లో పౌర హక్కుల సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ జంగాల కృష్ణయ్య పౌరుల హక్కులు, రెవెన్యూ పరంగా గ్రామంలో భూ సమస్యలు, సాగు వివాదాల గురించి వివరించారు. పోలీస్ చట్టాల గురించి ఎస్ఐ ఉప్పు సురేష్ పేర్కొన్నారు. కార్యక్రమంలో ఆర్ఐ సందీప్ పాల్గొన్నారు.